# నమ్మకాలు




— ఎలక్ట్రాన్

నమ్మక మనేది మనిషి జీవితంలో ఒక కుమ్మరి పురుగు లాంటిది. నమ్మకాలకి లొంగిన మనుషులు మనసుల చుట్టూ చెదలు పెంచుకొని, అదో రకమైన జీవితానికి అలవాటు పడిపోతారు. తనమీద తనకు నమ్మక మున్న మనిషి ఏ ఇతర విషయాల మీదా నమ్మకాలు పెంచుకోడు. అది లోపించినప్పుడే రకరకాల నమ్మకాలు పుట్టుకొస్తాయి. దేవుళ్ళూ, దెయ్యాలూ, బాబాలూ, జాతకాలూ, మంచిరోజులూ, వర్జ్యాలూ, శకునాలూ ... ఒక టేమిటి, రకరకాలుగా మూఢ నమ్మకాల్ని పెంచుకొని బాధపడుతుంటారు. నా మీద నాకు నమ్మక మున్న రోజుల్లో నే నాలోచించే తీరు ఇలా ఉండేది.

అయితే కొన్ని సంఘటనలు నన్నోసారి ఈ నమ్మకాల వైపు మొగ్గేటట్లు చేశాయి.

నేను డెహ్రాడూన్‌లో ఉంటున్నప్పుడు నా స్నేహితు డొకడు సకుటుంబంగా మన వైపు నుండి వచ్చి, నన్నూ, నా కుటుంబాన్నీ హరిద్వార్ ప్రయాణానికి లేవదీశాడు. హరిద్వార్‌లో గంగ నీళ్ళు చల్లగా ఉండటానికి ఒక కాలమంటూ లేదు. అవి ఎప్పుడూ అతి చల్లగానే ఉంటాయి. పిల్లలు నీటిలో దిగడానికి మొరాయించి, గట్టునే బట్టలకు కాపలా కాస్తూ కూర్చున్నారు. నా స్నేహితుడు వెంకటాద్రీ, నేనూ ప్రాణా లుగ్గబెట్టుకొని, నరాలు గడ్డ కట్టుకుపోయే చలిలో, మంచు గడ్డలా చల్లగా ఉన్న గంగలో ఒక మునుగు మునిగాం. అదే వూపులో మరో రెండు మునకలు వేసి, గట్టుమీదకు పరుగెత్తి బట్టలు కట్టుకున్నాము. మా వాడు బేరమాడిన పండా అతగాడి చేత పితృ దేవతలకు తర్పణా లొదిలిస్తున్నాడు. పేరు పేరునా తాత ముత్తాతల దగ్గర్నించీ చదివించి గంగాజలం మంత్రోక్తంగా వదిలిస్తున్నాడు. వెంకటాద్రికి పన్నెండో ఏటనే అతగాడి తండ్రి కాలం చేశాడు. వెంకటాద్రి తన తండ్రి శేషాద్రి పేరున తర్పణా లొదిలాడు. గట్టున కూర్చున్న వెంకటాద్రి ఏడేళ్ళ కొడుకు శేషాద్రి ఉన్నట్టుండి "అమ్మా, కడుపంతా నీళ్ళతో నిండినట్టవుతోందే!" అన్నాడు.

"అవుటుకి వస్తోందేమో, ఎట్లైనా వెళ్ళి పోసు

కావి రా" అన్నది వెంకటాద్రి శ్రీమతి.

"అది కాదే—అదోలకంగా నీళ్ళు కడుపులో పడు తున్న ట్లనిపిస్తోంది!" అని మరుక్షణంలో కాస్త దూరంలో ఎండ పొడన కూరున్న వాడి దగ్గరకు పోయి మాట్లాడ్డం మొదలుపెట్టాడు.

నేను అవాక్కయి వెంకటాద్రి కొడుకు వైపు చూస్తూ కూర్చుండిపోయాను! ఏమిటి విచిత్రం?! వెంకటాద్రి తన తండ్రి పేరన తర్పణాలు వదిలి నప్పుడు, వెంకటాద్రి కొడుకు తన కడుపు నీళ్ళతో నిండినట్లు అనుభూతిని పొందడం విచిత్రం కాక మరేమంటారు?

ఈ విషయం గురించి చర్చించి రెండు గంటల సేపు ఇద్దరమూ బుర్రలు పాడుచేసుకున్నాం. తర్వాత ఏదో యాదృచ్ఛికంగా జరిగి ఉంటుందని కొట్టి పారేశాం.

కొంతకాలం తర్వాత ఆఫీసు పనిమీద శ్రీనగర్ వెళ్ళవలసి వచ్చింది ఒకసారి. పని పూర్తయిన రోజున పూరిమీద పడ్డాను. సాయంత్రం శంకర మఠం కొండమీద నుంచొని, డాల్ లేక్ వైపు శ్రీనగర్ సౌందర్యాన్నీ, నగర మంతా అల్లుకుపోయిన మురికి కాల్వల సొంపునీ చూస్తుండగా, పచ్చి పక్కనే నిల్చున్న స్నేహితుడు శ్రీపతిని గుర్తు పట్టాను. రాజమండ్రీ కాలేజీలో ఇద్దరమూ కలిసి చదువు కొన్నాం. అతగాడికి చండీఘర్ నుంచి శ్రీనగర్ బదిలీ అయి రెండు నెల లయిందట. నా కంటె చాలా ఆలస్యంగా పెళ్ళయిం దతనికి. పెళ్ళానికి మొదటి కానుపు అవటం మూలాన, పుట్టింట్లోనే ఉంచే శాడు — పురుడు వచ్చిన తర్వాత ఏకంగా తీసు కొద్దామని. ఈ లోపుగా అతనికి క్వార్టర్సూ అవీ దొరికాయి.

శ్రీపతి బలవంతం మీద ఆ మర్నాడు చేయ వలసిన తిరుగు ప్రయాణాన్ని వాయిదా వేసుకొని, హోటల్లోంచి మకాం ఎత్తేసి అతనాడి క్వార్టర్సుకి వెళ్ళాను. రాత్రి భోజనా లయిన తర్వాత ఆ మాటా ఈ మాటా మాట్లాడుకొంటూ మర్నాడు 'పహల్‌గావ్' ప్రయాణం వేసుకొన్నాం. శ్రీపతి వాళ్ళ ఛీఫ్ ఇంజనీర్‌కి టెలిఫోన్ చేసి రెండు రోజులు సెలవు తీసుకొన్నాడు. నేనూ మా బాస్‌కి ట్రంక్‌కాల్ చేసి, రావడం నాలుగైదు రోజులు ఆలస్యం కావచ్చునని చెప్పాను.

మర్నాడు ఉదయం టూరిస్ట్ బస్‌లో పహల్ గావ్ బయలుదేరాం. దారిలో 'మటన్' అనే గ్రామం దగ్గర బస్సు ఆగింది. అక్కడున్న ఆలయం ముందున్న కొలనులో రకరకాల చేపల్ని చూస్తుండగా నుదుట ఎర్రగా కుంకం బొట్టూ, తల మీద పసుపు రంగు తలపాగా, భుజాల మీదుగా కాషాయరంగు గోవుల కండువా, కాళ్ళకు పావుకోళ్ళూ ధరించిన ఒక వ్యక్తి మా దగ్గరకు వచ్చాడు. సంభాషణంతా హిందీలోనే జరిగింది.

"అదృష్ట జాతకులు. కాశ్మీరు మనుషులు కారు. మద్రాసీలు—అవునా?" అన్నాడు.

"మద్రాసీలం కాం. ఆంధ్రులం; హైదరాబాదీ యులం!" అన్నాను చిరాగ్గా. శ్రీపతి నవ్వి పూరు కొన్నాడు.

"అయితే పవిత్ర గోదావరీ నదీ ప్రాంతం .. వాళ్ళు. ఆ నీటిని తాగి పెరిగిన మీరు చాలా అదృష్టవంతులు!"

నేనూ, శ్రీపతీ మాట్లాడలేదు. నాది రాజమండ్రి. అతగాడిది కొవ్వూరు.

"ఎన్ని తరాలనుంచి పడి ఉన్నాయోకాని, మా ఇంట భృగునాడి పత్రాలున్నాయి. మీ పేరూ తండ్రి పేరూ చెప్పండి. నేను సాయంత్రం ఈ బస్సు తిరిగి వెళ్ళే సమయానికి వెదికి పైకి తీస్తాను. మీ అదృష్టం బావుంటే దొరకొచ్చును." ఆ వ్యక్తి తిన్నగా వ్యాపార సరళిలోకి దిగాడు.

శ్రీపతి నవ్వుతూ అడిగాడు: "ఏమాత్రం ఖర్చవు తుంది? అయినా ఈ నాడి హోషియార్‌పూర్‌లో ఎవరి దగ్గరో ఉందని విన్నాను!?"

"ఉండొచ్చు! ఇవి చెల్లాచెదరై చాలా మంది చేతుల్లో పడ్డాయి. అందుకనే దొరికితే మీ అదృష్ట మంటున్నాను. మీరు ముందుగా రెండు రూపాయలు అడ్వాన్సుగా ఇవ్వండి, నేను వెదకడానికి పడే శ్రమ ఫలంగా. మీ నాడి దొరికితే, రేపు మీరు పదిరూపాయ లిచ్చి దాన్ని తీసుకు పోవచ్చు."

"దొరక్కపోతే?" నేను ప్రశ్నించాను.

"ఒక బీద బ్రాహ్మడికి మీరు రెండు రూపా యలు దానం చేసిన ట్లవుతుంది! నా పొట్ట గడవ డానికిదో మార్గం. ఇంటిలో దారిద్ర్యం ఏమీ లేదు."

"నువ్విచ్చే నాడి నిజమైందని దాఖలా ఏమిటి?" శ్రీపతి ప్రశ్నించాడు.

"మీకు నమ్మక ముంటే, నా కిప్పుడు రెండు రూపాయ లివ్వండి. లేకపోతే, నాడిని శంకించే వాళ్ళని బలవంతం చేసే అలవాటు నాకు లేదు!" ఆ వ్యక్తి కొంచెం కోపంగా అన్నాడు. మా వాడు మరి మాట్లాడకుండా రెండు రూపాయ లిచ్చి అత డడిగిన వివరాలు చెప్పాడు. అతను ఒక చిన్న నోట్ బుక్‌లో వ్రాసుకొని నా కేసి చూశాడు. నేను నవ్వివూరు కోవడంతో మమ్మల్ని వదిలి మరో గుంపు దగ్గరకు పోయాడు. తెచ్చి పెట్టుకున్న ఆ కోపం కూడా మనిషి మనస్తత్త్వం మీద అయుధంగా ప్రయోగించి తన వ్యాపారాన్ని కొనసాగించే ఆ వ్యక్తి ధైర్యాన్ని నేను మెచ్చుకోకుండా ఉండలేకపోయాను.

పహల్‌గావ్‌లో ఆ రోజూ, మర్నాడు ఉదయమూ చాలా కులాసాగా గడిపేశాం. తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యే సమయానికి శ్రీపతికి ఎక్కడలేని జ్వరమూ ఒక్కసారిగా ముంచు కొచ్చింది. రెండో నాలుగు మాత్రలు మింగించి, అలాగే తీసుకు వెళ్ళి బస్సులో కుదేశాను. ఆ పైన శ్రీపతికివొళ్ళు తెలియ లేదు. మటన్ చేరిన తరవాత బస్సు ఆగింది. శ్రీపతి మంచి నిద్దలో ఉన్నాడు. బస్సు దిగి క్రితం రోజు వ్యక్తికోసం చూశాను. కోనేటి పక్కనుంచి వడివడిగా అడుగులు వేసుకొంటూ వస్తున్న అతణ్ణి చూసి ఎదురు వెళ్ళాను. నన్ను గుర్తుపట్టి అడిగాడు: "మీ స్నేహితుడేడి?"

"జ్వరంతో పడున్నాడు. అతన్నిప్పుడు బాధ పెట్టదల్చ. నాడి దొరికిందా?"

"నేను చెప్పానుగా, అదృష్టవంతులకి దొరుకు తుందని!" అంటూ సంచీలోంచి ఒక సెలోఫిన్ కవరు పైకి తీశాడు. దాని లోపల పచ్చబారిపోయిన కాగితం మీద అతి లీలగా సంస్కృతంలో వ్రాసిన ఏవో కొన్ని వాక్యాలు కనబడ్డాయి. నేను పదిరూపాయ లిచ్చి ఆ కవ రందుకొన్నాను. "జాగ్రత్త! తాళ పత్రాలు చెదలు పట్టిపోతోంటే, వాటి నుంచి ఈ కాగితాల మీదకు ఎక్కించారు మా పూర్వీకులు. ఈ కాగితం కూడా శిథిలావస్థలో ఉంది. నువ్వు మడిచా వంటే అప్పడంలా విరిగిపోతుంది. ఇంతకీ నీ స్నేహితుడికి సంస్కృతం వచ్చునా?" ఆ వ్యక్తి అన్నాడు.

"నాకూ, నాకు తెలుసున్నంతవరకూ అతిగాడికీ సంస్కృతం తెలియదు!" అన్నాను నవ్వుతూ.

"సరేలే, మీ రింటికి పోయి సావధానంగా ఎవరిచేతనైనా చదివించుకోండి. కొన్ని వివరాలు నోటి మాటగా చెప్తున్నాను. ఎందుకంటే ఈ నాడిని ఎక్కడైనా జారవిడిస్తే కష్టం కదా?"



బస్సు వెళ్ళిపోతుం దేమో నన్నట్లుగా చూశాను. నా ఉద్దేశ్యం గ్రహించిన వాడల్లే ఉంది, మాట్లాడ్డం మొదలు పెట్టాడు. "ఫర్వాలేదు. బస్సింకా కొన్ని నిమిషా లాగుతుంది. ఈ జాతకుడికి మంచి యోగ దశ ఉంది. ఆధునిక నిర్మాణానికి సంబంధించిన శాఖలో పనిచేస్తున్నాడు..." ఇలా ఏవేవో కొన్ని వివరాలు చెప్పిన తంవాత చివరగా అన్నాడు: "మీ స్నేహితుడి. ప్రథమ సంతానానికి రెండేళ్ళ వయసులో మారకం ఉంది." ఆ లోపులో బస్ హారన్ విని, ఆ వ్యక్తిని వదలి పరుగెత్తాను. శ్రీపతి అలానే పడుకునాడు. ఆ కవర్ని నా బ్రీఫ్‌కేసులో పడేశాను.

శ్రీనగర్ చేరుకున్న తర్వాత, అతను జ్వరం నుంచి తేరుకొనే వరకూ మరో రెండు రోజు లాగి పోయాను. మూడో రోజు సాయంత్రం నేను తిరు గు ప్రయాణం సన్నాహంలో ఉండగా, శ్రీపతికి నాడిని గురించి జ్ఞాపకం వచ్చింది.

"అన్నట్టు, మలున్ దగ్గర ఆ వ్యక్తిని మనం కలుసుకోలేదు కదూ?" శ్రీపతి అడిగాడు.



"నువ్వేదో ఒళ్ళు తెలియని జ్వరంలో పడున్నావ్. నేను కిందకు దిగి ఆ వ్యక్తి కోసం చూశాను. ఆయన పూ పత్తా లేడు! సరేలే, దానం చేశావనుకో!" అన్నాను నవ్వుతూ. నాకు నమ్మకం లేకపోయినా, నమ్మక మున్న శ్రీపతికి ఆ కాబితం ఇవ్వడం నాకు మనస్క రించలేదు. పెళ్ళానికి తొలి కాన్పు. అందులోని ఉవాచ అతగాడేం సీరియస్‌గా తీసుకొని మనసు పాడు చేసుకొంటాడేమోనని, నా భయం.

డెహ్రాడూన్ వెళ్ళిన తరవాత ఆ కాగితాన్ని పెట్టడుగున పారేశాను. ఒక ఆరేడేళ్ళు కాలగర్భంలో కలిసిపోయాయి. ఉన్నట్టుండి ఒక రోజున శ్రీపతి సకుటుంబంగా దిగాడు. మా ఇంట. ముస్సోరీలో ఏదో పనిమీద వచ్చాడట. కలిసి కాస్త సరదాగా తిరగొచ్చునని కుటుంబంతో వచ్చాడు.

అతగాడికి ముగ్గురు పిల్లలు. "వీడు మా మొదటి వెధవ. నువ్వప్పుడు శ్రీనగర్ వచ్చినప్పుడు మా ఆవిడ కాన్పు కెళ్ళిం దన్నానే, వాడే వీడు, వీ ళ్ళిద్దరూ, తర్వాత ఆడపిపిల్లలు." శ్రీపతి తన పిల్లల్ని చూపిస్తూ అన్నాడు.

ముస్సోరీలో శ్రీపతి పని పూర్తయింది. అలసి పోయిన ఆడవాళ్ళూ, పిల్లలూ దూరంగా బెంచీల మీద కూలబడ్డారు. టైగర్ హిల్ మీద నుంచి లోయల్లోకి చూస్తూ శ్రీపతికి జరిగినదంతా చెప్పి, అడిగాను. "ఇప్పుడేమంటావు? ఆ కాగితం నా దగ్గరే ఉంది. కావాలంటే తీసుకుపో, పది రూపాయ లిచ్చి మరీను! దాన్ని నమ్మితే నీ మన సెంత పాడై ఉండేదని?"

"అందులోని వివరాలు ఏం తప్పని? నా ఉద్యోగ లక్షణాలు సరిపోయాయి. ఈ ఆరేళ్ళ లోనూ మూడు ప్రమోషన్లు వచ్చాయి!"

"అవి సరే, మనం చేసే ఉద్యోగాలన్నీ ఆధునిక నిర్మాణానికి సంబంధించినవే. అది మనం అన్వయించు కోవడంలో ఉంటుంది. ఉద్యోగం అన్న తర్వాత ప్రమోషన్లు ఎప్పుడో, అప్పుడు రాక మానవు. నే నంటున్నది మీ మొదటి వాడిని గురించి. వాడి కిప్పు డారేళ్ళు దాటాయి. అందులో రెండో ఏట ప్రథమ సంతానానికి మారకం రానుందని చెప్పారుగా!"

శ్రీపతి ఒక్క క్షణం ఆగాడు. కొండల మాటున దిగజారుతున్న సూర్యుడి ఎర్రదనంలోకి చూస్తూ నె మ్మదిగా అన్నాడు. "నీకు తెలియని నిజం చెప్తున్నాను. పెళ్ళి కాక మునుపు నేను అతి విచిత్రమైన పరిస్థితుల్లో ఒక యువతి పరిచయంలో పడ్డాను. నా వల్ల ఆమెకు కలిగిన ఆడపిల్ల రెండో ఏటనే చనిపోయింది. నా కున్న ఈ అక్రమ సంబంధం కూడా ఆ నాడిలో ఉండే ఉంటుంది. కావాలనే అతగాడు నీతో చెప్పి ఉండడు!"

లోయలో చీకటిలాగే, నా మనస్సుని ఈ నమ్మక మనే చీకటి ఆవరించ సాగింది. ఆ రాత్రి ఇంటికి వెళ్ళిన తరవాత ఆ నాడిని పైకి తీసి మా ఇంటి యజమాని చేత చదివించాను. అందులో ఒక వాక్యం...'ఇతగాడు మంచి రసికుడు!'

ఈ రెండు సంఘటనలూ నా దృక్పథంలో కొంత మార్పును తీసుకొచ్చాయి. కొద్ది కొద్దిగా నమ్మకాలు మొలకెత్తడం ప్రారంభించాయి.

ఒకసారి ఢిల్లీ నుంచి ఒక ఉద్యోగానికి హటాత్తుగా టెలిగ్రాం ద్వారా ఇంటర్‌వ్యూ కాల్ వచ్చింది. సరిగ్గా ఆ సమయానికి బదరీనాథ్, రుద్రప్రయాగ లాంటి పుణ్యక్షేత్రాలూ, ఋషీకేశ్, హరిద్వార్ లాంటి పుణ్య తీర్థాలూ దర్శించి, తన మనవరాలి దగ్గర ఒక నెల రోజుల పాటు ఉన్నట్లుంటుందని, మా శ్రీమతి మామ్మగారు డెహ్రాడూన్‌లో మాతో ఉన్నారు. ఇంక ఆవిడ చేసిన ఆర్భాటం ఇంతా అంతా కాదు. ఆ రోజు ఉదయం మా ఆవిణ్ణి చలిలో స్నానం చేయించి, దేవుడికి దీపం పెట్టించింది. ఎనిమిదిన్నర వరకూ దుర్ముహూర్తం. ట్రైన్ సరిగ్గా తొమ్మిదింటికి. "చూడు, బాబూ, చాదస్తం మనిషి అను కోకు. ఇక్కడ నువ్వు రైల్లో కాలు పెట్టిన తర్వాత ఢిల్లీ చేరేవరకూ కిందకు దిగరాదు. అంటే ఇక్కడ గడ్డమీద తీసిన కాలు మళ్ళీ ఢిల్లీ గడ్డమీదనే మోపాలన్న మాట! నిన్న రాత్రి పీడ కల వచ్చింది. ఇంజన్ వెనక పెట్టెలో మట్టుకు కూర్చోకు!" ఆవిడ పోరు పెట్టి, నా చేత అలానే చేస్తానని ఒట్టు వేయించుకొంది. రిక్షా ఎక్కిన తర్వాత మంచి శకునం రాలేదని పది నిమిషాలు కదల నివ్వలేదు. అంతలో ఎదురుగా,మా సందు చివరగా ఉండే ఒక పాకలోని పనిమనిషి ఎదురు వస్తూండడం చూసి "పోనీరా, అబ్బీ" అన్నాను. గుమ్మంలో నిల్చున్న ఆవిడ 'ఆ మనిషి పునిస్త్రీయేనా?" అని అడిగింది.

"ఆ మనిషికి ఇద్దరు మొగుళ్ళు. డబల్ పునిస్త్రీ!" అన్నాను (హిమాలయ పర్వతప్రాంతంలో ఒక తెగకు చెందిన మనిషి ఆమె. బహు భర్తృకలు వాళ్ళు). ఆవిడ తెల్లబోయింది. రిక్షా కదిలింది. స్టేషన్ చేరి, టికెట్ కొని ప్లాట్‌ఫారం మీదకు వెళుతుండగా బండి కదిలింది. చచ్చి చెడి పరుగెత్తి చివరి కంపార్ట్‌మెంట్ అందుకొని అందులో కూలబడ్డాను. చాలా రష్‌గా ఉంది. మరో స్టేషన్‌లో దిగి పెట్టె మారుదా మన్నా వీలులేని పరిస్థితి. కిందకు దిగరాదు కదా! పోనీలే, ఇంజన్ వెనుక పెట్టె కాదని సంతృప్తి పడ్డాను.

అయితే 'లక్సర్' చేరుకున్న తరాత కాని జరిగిన పొరపాటు తెలియలేదు. అక్కడ ఇంజన్ అటునుంచి ఇటు మారి నే నున్న పెట్టెకు తగిలించబడింది! డెహ్రాడూన్ నుంచి ఢిల్లీ పోయే రైళ్ళు దిక్కు మారి షహరన్ పూర్ మీదుగా వెళ్తాయన్న మాట. (ఇలా ఇంజన్లు ఒక వైపు నుంచి మరో వైపుకు మారే స్టేషన్లు మన దేశంలో చాలా ఉన్నాయి. వాల్తేరు, విజయవాడ ... వగైరా వగైరా). ఈ సంగతి మరిచినందుకు తిట్టుకొన్నాను! సరే, నా ఇరకాటం. ఏమిటో మీ కర్థం అయ్యే ఉంటుంది. పెట్టె దిగి మారితే నడిగడ్డ మీద కాలు మోపి నట్టు! లేకపోతే షహరన్ పూర్ వరకూ నల్ల రాక్షసి వెనక ప్రయాణం తప్పదు. ఏం చేసినా వ్రతం చెడుతుంది. 'సరేలే, షహరన్ పూర్‌లో ఇంజన్ మళ్ళీ దిక్కు మారుతుంది. ఇందులోనే ఉందాం' అనుకుంటుంటే, నలుగు రైదుగురు వ్యక్తులు చేపల బుట్టలతో అందులో దూరబడ్డారు. ఆ వాసన భరించలేక, వేరు ఆలోచన లేక, ఆ పెట్టె దిగి మధ్యగా ఉన్న మరో పెట్టెలో ఎక్కాను. కాని నాకు మనశ్శాంతి లేకుండా పోయింది.

ఆలోచనలు మనసును కలవరపెట్టడంతో, ఇంట ర్వ్యూలో అడిగిన ప్రశ్నల కసరు పెట్టేశాను. అన్నీ తెలిసిన ప్రశ్నలే అయినా దారుణంగా తగలేశాను. పరిణామం వేరే చెప్పాలా?

మామూలుగా వెళ్ళి ఉంటే, నా కున్న క్వాలిఫికేషన్స్, అనుభవాల మూలాన ఆ ఉద్యోగం సులువుగానే దొరికి ఉండేది. ఈ కాలంలో ముఖ పరీక్షల్లో ముఖ్యంగా చూసే మరో అంశం చలాకీతనం. లేనిపోని శంకలతో మనస్సుని కలవర పెట్టుకున్న నాలోని నీరసమే వాళ్ళకు కనబడింది కాని, నా అర్హత కాని అనుభవం కాని కాదు. ముసలావిణ్ణీ, పట్టు సడలిన నా మనస్సునీ ఎంత తిట్టుకొని మాత్రం ఏం ప్రయోజనం?

అర్థంలేని నమ్మకాలు మనిషికి అనర్థం కలిగిస్తాయే తప్ప, వాటి వల్ల ప్రయోజనం ఉండదని గుర్తించి, వాటికి దూరంగా ఉంటున్నాను. ✱

